







అన్నీ ఇల్లుపీకి పందిరేశాయి. ఇలా అన్ని రంగాల్లో న్యూనతాభావం ముసురుకొన్న కాలానికి ఉద్యమ సమయం నుంచి దీటైన సమాధానంగా పదేండ్ల క్రితం పడిన సాంస్కృతిక పునాది క్రమక్రమంగా ఆకాశమంత ఎత్తున ఠీవీతో సగర్వంగా నిలబడింది. ఇవాళ తెలంగాణలో యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఆధ్యాత్మిక కేంద్రంగా మారిపోయింది. బతుకమ్మ, బోనాల పండుగలను రాష్ట్ర పండుగలుగా ప్రకటించుకోవడం, మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరను ఘనంగా నిర్వహించడం, రామప్పను ప్రపంచ వారసత్వ కట్టడంగా నిలుపుకోవడం ఇలా ఒకటేమిటి ఈ పదేండ్ల కాలంలో సాంస్కృతిక ఔన్నత్యం దిశగా పడిన అడుగులు అసామాన్యమైనవి. దశాబ్దాలపాటు జోకర్లు, విలన్లు మాట్లాడే భాషగా తెలంగాణ యాసను చిత్రీకరించిన సినిమా ఇప్పుడు తన స్వరూపాన్నే మార్చుకునేలా జరిగిన ప్రయాణం అసాధారణం. అనిర్వచనీయం. ఇవాళ తెలంగాణ యాసలో పూర్తినిడివి చిత్రాలు తెలుగు సినిమాను మెరిపిస్తున్నాయి. నాటుగా.. మోటుగా ఉంటుందని ఈసడించుకున్న భాషలోనే 'నాటు... నాటు..నాటు' అని పాడితే ప్రపంచమంతా చిందేసింది. ఇప్పటిదాకా ఆస్కార్ గుమ్మం తొక్కని వందేండ్ల తెలుగు వెండితెరకు 'మిరపకాయ తొక్కే' అవార్డు రప్పించింది.

**పడింది పది అడుగులే.. కానీ...**

తెలంగాణ ఇప్పటి వలె ఈసడింపుగా.. ద్వేషభావంతో ఎప్పుడూలేదు. సద్దితిన్న రేవును తలిస్తే బతుకు ఉంటది. బతుకు అని బతుకమ్మ లెక్క దీవెనిస్తది. ఆరు దశాబ్దాల కింద 'కట్టిన ఇల్లు పెట్టినపొయ్యి సిద్ధంగా ఉంది' అని చొరపడిన కాలం మళ్లీ ఇప్పుడు కండ్లముందు కదలాడుతున్నదా? ఉమ్మడి పాలనలో అణచివేతకు, పరాధీనతకు లోనైన తెలంగాణ రాజకీయ సమాజం తిరిగి అదే తోవతొక్కుతున్నదా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

నిజానికి ఒక సమాజం తనను తాను నిరూపించుకోవటానికి పదేండ్ల కాలం అతిస్వల్పమే. కానీ, పడింది పది అడుగులే అయినా.. వేలాది ప్రశ్నలకు సమాధానమై నిలిచింది. యాదాద్రి నర్సన్న గుడిని 'నభూతో...' అన్న రీతిగా నిర్మించినా, మూడేండ్ల రికార్డు సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిచేసినా, నల్లగొండలో ఫ్లోరైడ్ పీడను బండకేసి కొట్టినా, కల్యాణలక్ష్మితో పేదింటి బిడ్డ పెండ్లికి అండగా నిలిచినా... ఏటూరునాగారం, తిర్యాణి వంటి కీకారణ్యంలోని ప్రభుత్వ దవాఖానల్లోనూ కాన్పుల కాలాన్ని సృష్టించినా, ఉమ్మడి రాష్ట్రంలో కేవలం వందకు పైచిలుకు ఉన్న గురుకులాల సంఖ్యను వెయ్యి దాటించినా.. ఇంకేదైనా సరే, అనేక రంగాల్లో మార్పు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. రాష్ట్రంగా అవతరించిన పదేండ్ల తర్వాత చూస్తే... తెలంగాణ సఫల రాష్ట్రంగా ఎవరిముందూ తలవంచని స్థితికి చేరుకున్నది. అదే సమయంలో తనను మళ్లీ విఫల ప్రయోగంగా అపఖ్యాతికి గురిచేయొద్దని హెచ్చరిస్తున్నది. ఒకవేళ ఏమరుపాటుగా తప్పటడుగు పడితే ఎత్తేందుకు పిడికిలి సిద్ధంగానే ఉన్నది. దిక్కులు పిక్కటిల్లేలా ధిక్కార గొంతుకై 'జై తెలంగాణ' అని పలికేందుకు, 'పోరు' అడుగు వేసేందుకు వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని గతం నేర్పిన పాఠాన్ని గుర్తు చేస్తూనే ఉన్నది.

